# అర్చకులకు వేతనం పెంపు

- అక్టోబర్ నుంచే రూ.10 వేల గౌరవ వేతనం అమలు
- మరో 75 ఆలయాలకూ వర్తింపు



నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 6 : రాష్ట్ర ప్రభుత్వం ధూపదీప నైవేద్యం పథకం అర్చకులకు శుభవార్త ప్రకటించింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ధూపదీప నైవేద్యం అర్చకుల గౌరవ వేతనం రూ. 10వేలు ఈనెల నుంచి అమలు కానున్నది. రాష్ట్రంలోని మరో 350 ఆలయాలకు డీడీఎన్ వర్తింపచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై అర్చక ఉద్యోగ సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది.

**మరో 75 ఆలయాలకు..**

ధూపదీప నైవేద్యం పథకం ఉమ్మడి జిల్లాలో 407 ఆలయాలకు ఉన్నది. కొత్తగా ఈ పథకంలోకి మరో 75 ఆలయాలు చేరాయి. దీంతో వీటి సంఖ్య 482కు చేరుకున్నది. ఈ ఆలయాల్లోని అర్చకులకు ప్రతి నెలా రూ. 10వేల గౌరవ వేతనం వారి బ్యాంకు ఖాతాల్లో జమ కానున్నది. నిజామాబాద్ నగరంలోని గాజుల్‌పేట్‌లో అర్చక ఉద్యోగ సంఘాల జేఏసీ ప్రతినిధులు సమావేశం నిర్వహించి సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. డీడీఎన్ నిజామాబాద్ అధ్యక్షుడు రాచప్ప, కామారెడ్డి అధ్యక్షుడు అంజనప్ప, ఉపాధ్యక్షుడు శ్రీనివాసశర్మ, కోశాధికారి రాజేందర్ స్వామి, పరమేశ్వర్, శంకరప్ప, సహాయ కార్యదర్శి కిరణ్‌కుమార్ శర్మ, ముఖ్య సలహాదారులు శివస్వామి, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

**సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం..**



ఉమ్మడి జిల్లాలో 482 ఆలయాలకు ధూపదీప నైవేద్యం కింద రూ. 10వేలు అందుకోవడం సంతోషంగా ఉన్నది. సీఎం కేసీఆర్ అర్చకుల పక్షపాతి. సీఎం నిర్ణయంతో పేద పూజారులకు ఉపాధి లభిస్తున్నది. సీఎం పదికాలాల పాటు చల్లగా ఉండాలని దేవున్ని ప్రార్థిస్తున్నాము.

**- అంజనప్ప, డీడీఎన్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు**

**సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ కోసం..**



సీఎం కేసీఆర్ అర్చకులకు శుభవార్త ప్రకటించడం సంతోషంగా ఉన్నది. డీడీఎన్ పథకంతో పేద పూజారుల కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతున్నది. ఆలయాల్లో పూజలతో పాటు సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ కోసం సీఎం కేసీఆర్ కృషిచేస్తున్నారు.

**- రాచప్ప, డీడీఎన్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు**

## కానిస్టేబుల్ ఉద్యోగంపై యువకుడి మక్కువ

**రూ. 20 లక్షల ప్యాకేజీ వదులుకున్న వైనం**



రాజుల అరవింద్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 6 : ఓ యువకుడు ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. తనకు ఇష్టమైన కానిస్టేబుల్ ఉద్యోగాన్ని సాధించి తన లక్ష్యాన్ని నెరవేర్చుకున్నాడు. ప్రైవేటులో లక్షల రూపాయల ప్యాకేజీతో చేస్తున్న ఉద్యోగాన్ని వదులుకొని.. తాను కోరుకున్న కానిస్టేబుల్ కొలువును చేపట్టాడు. నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండలంలోని హాసాకొత్తూర్‌కు చెందిన యువకుడు రాజుల అరవింద్ ఎంటెక్ చదివాడు. బెంగళూరులో రూ. 20 లక్షల ప్యాకేజీతో డిజైన్ ఇంజినీర్‌గా పనిచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ పరీక్ష రాశాడు. ఇటీవల వెల్లడించిన ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడంపై అరవింద్‌ను సర్పంచ్ ఏనుగు పద్మా రాజేశ్వర్, ఉపసర్పంచ్ ఏనుగు రాజేశ్వర్ తదితరులు శుక్రవారం సన్మానించారు.

## జూనియర్ కాలేజీ ఏర్పాటుకు భవనం పరిశీలన



గోపాల్‌పేటలో పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎల్లారెడ్డి, అక్టోబర్ 6: నాగిరెడ్డిపేట మండలానికి ప్రభుత్వ జూనియర్ కాలేజీ మంజూరైన విషయం తెలిసిందే. కాలేజీ ఏర్పాటు కోసం మండల కేంద్రం గోపాల్‌పేటలో భవనాన్ని అధికారులు శుక్రవారం పరిశీలించారు. గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో ఉన్న గదులను పరిశీలించిన వారు.. కాలేజీకి అనుకూలంగా ఉన్న గదులను గుర్తించారు. కార్యక్రమంలో ఇంటర్ విద్య జిల్లా నోడల్ అధికారి షేక్ సలాం, ఎంపీపీ రాజ్‌దాస్, నాగిరెడ్డిపేట సర్పంచ్ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేమంతా స్పీకర్ పోచారం వెంటే ఉంటాం

- పొతంగల్ పద్మశాలీ సంఘ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం
- సభాపతికి తీర్మాన ప్రతి అందజేత



స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డిని కలిసి సన్మానిస్తున్న పద్మశాలీ, బాగ్‌బాన్ సంఘం సభ్యులు

బాన్సువాడ/ కోటగిరి, అక్టోబర్ 6 : బాన్సువాడ డివిజన్ పొతంగల్ మండల కేంద్రానికి చెందిన పద్మశాలీ సంఘ సభ్యులు, బాన్సువాడ పట్టణానికి చెందిన బాగ్‌బాన్ సంఘం సభ్యులు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వెంటే ఉంటామని శుక్రవారం తీర్మానం చేశారు. బాన్సువాడలోని స్పీకర్‌కు తన నివాసంలో తీర్మాన కాపీని అందజేశారు. తామంతా అభివృద్ధి ప్రదాత స్పీకర్ పోచారం శ్రీనన్న వెంటే నడుస్తామని అన్నారు. రానున్న ఎన్నికల్లో స్పీకర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు.

## 9 నుంచి టైలరింగ్ శిక్షణ ప్రారంభం

డిచ్‌పల్లి, అక్టోబర్ 6 : ఎస్‌బీఐ– డిచ్‌పల్లి స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు ఈ నెల 9 నుంచి టైలరింగ్ శిక్షణ ప్రారంభమవుతుందని డైరెక్టర్ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఉచిత శిక్షణతోపాటు భోజన సదుపాయం, హాస్టల్ వసతి ఉంటుందని, శిక్షణ కాలంలో నేర్చుకోవడానికి కావాల్సిన మెటీరియల్, యూనిఫాం అందజేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. 19–45 సంవత్సరాల వయస్సు కలిగి ఉండి, నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన గ్రామీణ యువతులు అర్హులని వివరించారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పదో తరగతి మెమో, ఐదు పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఘన్‌పూర్ రోడ్డులో ఉన్న ఎస్‌బీఐ శిక్షణ కేంద్రంలో సంప్రదించాలని లేదా 08461 –295428 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

## జెండా బాలాజీని దర్శించుకున్న కమలానంద భారతీ స్వామి



జెండా బాలాజీ ఆలయంలో కమలానంద భారతీస్వామి

నిజామాబాద్ కల్చరల్, అక్టోబర్ 6 : ప్రముఖ ధార్మికవేత్త, భువనేశ్వరీ పీఠాధిపతి కమలానంద భారతీ స్వామి జెండా బాలాజీ ఆలయాన్ని, పూలాంగ్ చైరస్తాలోని జెండాను శుక్రవారం దర్శించుకున్నారు. సాక్షాత్తు తిరుమల శ్రీనివాసుడే జెండా బాలాజీగా ఇందూరులో కొలువై ఉన్నాడని అన్నారు. ఇందూరు మట్టికి ఎంతో చరిత్ర ఉందని, శ్రీరాముడు, సమర్థ రామదాసు ఈ ప్రాంతంలో పర్యటించారని అన్నారు. అనంతరం భక్తులకు ప్రవచనాలు చేశారు. అనంతరం స్వామీజీకి భక్తులు పాదపూజ చేశారు. కార్యక్రమంలో అర్చకులు అజయ్ సంగ్వాయి, సంజయ్, విజయ్, కందకుర్తి ఆనంద్, తిరుమల వినయ్, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్, ఆంజనేయులు, నాగరాజుచారి పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెండర్లు ఆర్థికంగా ఎదగాలి

- కామారెడ్డి కలెక్టర్ జితేశ్ పాటిల్
- ముగ్గురికి ఆర్థిక సహాయం అందజేత



ట్రాన్స్‌జెండర్‌కు చెక్కును అందిజేస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, అక్టోబర్ 6 : స్వయం ఉపాధి ద్వారా ట్రాన్స్‌జెండర్లు ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. తన చాంబర్‌లో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక పునరావాసం పథకం కింద యషిక, రష్మిక, పెరిసిస్ అనే ముగ్గురు ట్రాన్స్‌జెండర్లకు రూ.50 వేల చొప్పున శుక్రవారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే రూ.50 వేల సహాయంతో ఉపాధి కల్పించే వ్యాపారాలను ప్రారంభించుకొని, ఆర్థికంగా ఎదుగుతూ సమాజంలో గౌరవంగా జీవించాలని సూచించారు. జిల్లాలో 54 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు నమోదు చేసుకున్నారని తెలిపారు. ఇంకా ఎవరైనా ఉంటే ఓటర్లుగా నమోదు చేసుకొనేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో డీడబ్ల్యూవో బావయ్య పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

మోర్తాడ్, అక్టోబర్ 6: సుంకెట్ గ్రామానికి చెందిన ఆకుల బాలకిషన్ (37) శుక్రవారం ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలకిషన్ కూలీపని చేసుకుని జీవనం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం పక్కనే ఉన్న రామన్నపేట్ గ్రామంలోని వరిపంట క్షేత్రంలో మరమ్మతులు చేసిన మోటారును బోరుబావిలో దించే క్రమంలో పైప్‌లైన్ పక్కనే ఉన్న విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు.

# హెల్మెట్ల వితరణ వేముల మానవత్వానికి నిదర్శనం

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 6: యువతకు హెల్మెట్ల వితరణ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి మానవత్వం, సేవాగుణానికి నిదర్శనమని బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారు హెల్మెట్లు ధరించకపోవడంతోనే ప్రాణాలు కోల్పోతుండడంతో యువతకు మంత్రి హెల్మెట్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో వివిధ గ్రామాల యువకులకు స్థానిక నాయకులు హెల్మెట్లను శుక్రవారం పంపిణీ చేశారు. మంత్రి వేముల తన సొంత ఖర్చులతో ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు వేలాది మందికి హెల్మెట్లను అందజేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లోలపు గౌతమీసుమన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్, రైతుబంధు సమితి మండల కో–ఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపీటీసీ మైలారం సుధాకర్, ఉపసర్పంచ్ పాలెపు చిన్న గంగారాం, పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు అహ్మద్ హుస్సేన్, యూత్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రఘు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు అజ్మత్ హుస్సేన్ పాల్గొన్నారు.



కమ్మర్‌పల్లిలో హెల్మెట్లు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు